క్లుప్తంగా

బహుముఖ ప్రజ్ఞాశాలి పట్టాభిరాం

లక్ష్మీపురం: మూడు దశాబ్దాల పాటు ఇంద్రజాలికుడిగా, హిప్నాటిస్టుగా, కౌన్సిలింగ్ సైకాలజిస్టుగా, రచయితగా తాను పని చేసిన ప్రతి రంగంలోనూ అగ్రస్థానంలో నిలిచిన పట్టాభిరాం లక్షలాది మందిలో స్ఫూర్తిని నింపి నిష్క్రమించారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహనవ సంస్థ కార్యాలయంలో గురువారం పట్టాభిరాంకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివరామిరెడ్డి మాట్లాడుతూ పట్టాభిరాం బహుముఖ ప్రజ్ఞాశాలిగా అని కొనియాడారు. ఇంద్రజాలికుడిగా పేరు, ప్రఖ్యాతలతో పాటు తెలుగు, కన్నడ, తమిళ భాషల్లో అత్యధిక పాఠకాదరణ కలిగిన రచయితగా సంచలనం సృష్టించారని వివరించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



లక్ష్మీపురం: జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 28న బ్రాడీపేట 4/7వ లైన్‌లో గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతుండగా, స్థానికులు గమనించి 108 వాహనం ద్వారా జీజీహెచ్‌కి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ జూన్ 30న మృతి చెందాడు. వయస్సు 40 సంవత్సరాలు ఉంటుంది. బ్రాడీపేట పరిసర ప్రాంతాల్లో విచారించినా వివరాలు తెలియక పోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు అరండల్‌పేట పోలీస్ స్టేషన్ (0863–2231955) లేదా సీఐ ఆరోగ్య రాజు 8688831332 నంబర్లను సంప్రదించాలి.

విస్తృతంగా వాహనాల తనిఖీ



లక్ష్మీపురం: వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. బృందావన్ గార్డెన్స్, బేకర్స్ ఫన్ సెంటర్, లాడ్జి సెంటర్ తదితర ప్రధాన ప్రాంతాల్లో ఆయా పోలీస్ స్టేషన్ల సిబ్బంది, సీఐలు, ఎస్‌ఐలు తనిఖీలు చేపట్టారు. వాహనాలు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్ చేశారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే ముందు తల్లిదండ్రులు వారి భవిష్యత్తు గురించి ఒక్కసారి ఆలోచించాలని తెలిపారు. ఈ సందర్భంగా వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ మాట్లాడుతూ వాహనదారులంతా ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని తెలిపారు. త్రిబుల్, సెల్ ఫోన్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరించారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

లక్ష్మీపురం: మీటర్ రీడింగ్ అంటూ ఇంట్లోకి వచ్చి వృద్ధురాలి మెడలో మూడు సవర్ల గొలుసు చోరీ చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. వికాస్‌నగర్ 5వ లైన్‌కు సంద్ర చిట్టిమ్మ అనే వృద్ధురాలు ఇంట్లో ఉన్న సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి విద్యుత్ మీటర్ రీడింగ్ తీయాలంటూ లోపలికి వచ్చాడు. ఇంట్లో ఎవరు లేరని తరువాత రమ్మని చెప్పడంతో, తాగేందుకు మంచినీరు కావాలని అడిగాడు.చిట్టిమ్మ లోపలికి వెళుతున్న సమయంలో వెనుక నుంచి వచ్చి మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. దీంతో ఆమె పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలంలో సీసీ కెమెరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రత్తిపాడు: లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ టి.సత్యనారాయణ తెలిపారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడులో గురువారం ఆయన పర్యటించారు. 2018–19, 2020–21లో జగనన్న లేఅవుట్‌లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు నిర్మించుకునేందుకు అదనంగా రూ.50 వేలను అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను స్థానిక ఏఈతో పరిశీలించారు. తొలుత ప్రత్తిపాడు హౌసింగ్ ఏఈ ఎస్.వీరాంజనేయులతో తిక్కిరెడ్డిపాలెంలో పర్యటించి నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించారు.

డెంగీపై అప్రమత్తత అవసరం

ప్రత్తిపాడు: డెంగీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ సూచించారు. జాతీయ డెంగీ మాసోత్సవంలో భాగంగా గురువారం ప్రత్తిపాడులో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని డాక్టర్ దుర్గాప్రసాద్ ప్రారంభించారు. దోమ పుట్టకుండా, కుట్టకుండా నివారిద్దాం.. అప్రమత్తతే రక్ష అంటూ నినాదాలు చేశారు. డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టాలంటే తొలి దశలోనే దోమల లార్వాను నిర్మూలించాలని తెలిపారు.

కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి

కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులతో సమావేశమైన కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో విభాగాల వారీగా కోర్ట్ కేసుల పరిష్కారంపై విభాగాధిపతులు, సూపరింటెండెంట్లు ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం కోర్ట్ కేసుల పురోగతి, పెండింగ్ అంశాలపై విభాగాధిపతులు, సూపరింటెండెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత విభాగాల వారీగా కేసులు, తీర్పులు, పెండింగ్ కేసులపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ కోర్ట్ కేసుల్లో ఎక్కువ శాతం పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించినవే ఉన్నాయని తెలిపారు. విభాగాధిపతులు ప్రతి రోజు సూపరింటెండెంట్, సంబంధిత అధికారులతో సమీక్షించుకోవాలని ఆయన ఆదేశించారు. నగరపాలక సంస్థ నుంచి తీసుకోవాల్సిన చర్యల్లో లోపం ఉంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇక నుంచి ప్రతి గురువారం కేసుల పురోగతిపై సమీక్ష చేస్తామని, రోజువారి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కేసుల్లో కౌంటర్లు, అఫిడవిట్లు, ప్యారావైజ్ రిమార్క్స్ వంటివి పూర్తి చేయాలని తెలిపారు. సూపరింటెండెంట్లు, లీగల్ సెల్ సిబ్బంది సమన్వయంతో ప్రతి రోజు కోర్ట్ కేసుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని చెప్పారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, మేనేజర్ బాలాజీ బాషా, విభాగాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

రోడ్ల మీద చెత్త వేస్తే అపరాధం రుసుం

రోడ్ల మీద చెత్త వేస్తే అపరాధ రుసుం విధించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన సుద్దపల్లి డొంక, పాత గుంటూరు, బాలాజీ నగర్, పొన్నూరు రోడ్, కేవీపీ కాలనీ మెయిన్ రోడ్, జాతీయ రహదారి వెంబడి పలు ప్రాంతాల్లో పర్యటించి, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో చర్యలు తీసుకుంటున్నప్పటికీ అనేక ప్రాంతాల్లో డంపింగ్ పాయింట్స్ ఉంటున్నాయని తెలిపారు. ఆయా పాయింట్స్ దగ్గర ప్రజారోగ్య కార్మికులను కొంత కాలం కేటాయించి, ప్రజలు వ్యర్థాలను వేయకుండా అడ్డుకోవాలని ఆదేశించారు. జాతీయ రహదారి వెంబడి కొబ్బరి బొండాలు, నిర్మాణ వ్యర్థాలు వేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని చెప్పారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణమూర్తి

లక్ష్మీపురం: నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న దేశవ్యాప్తంగా జరగబోతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి పిలుపు నిచ్చారు. కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక గుంటూరు సమితి ఆధ్వర్యంలో కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మికులను ,రైతులను శత్రువులుగానే భావిస్తోందని తెలిపారు. సమాజంలో సంపద సృష్టికర్తలైన కార్మికుల వినాశనానికి కార్పొరేట్ శక్తులతో కుమ్మక్కై నాలుగు లేబర్ కోడ్లను తీసుకు వచ్చిందని పేర్కొన్నారు. అవి అమలు చేస్తే కార్మికవర్గ నాశనమే అన్నారు. రైతులకు వ్యతిరేకంగా తెచ్చిన మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చే ప్రయత్నం చేసిందని తెలిపారు. రైతుల నుంచి పెద్దఎత్తున తిరుగుబాటు రావడంతో తాత్కాలికంగా ఉపసంహరించుకున్నా, దొడ్డిదారిలో అమలు చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. గిట్టుబాటు ధర చట్టం చేస్తానని హామీ ఇచ్చి, మాట తప్పిందని, దాని పర్యవసానమే కార్మికులు,రైతులు ఐక్యంగా ఉద్యమాలు నిర్వహిస్తూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చినట్లు వెల్లడించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు లక్ష్మణరావు మాట్లాడుతూ జిల్లాలో సమ్మె జయప్రదం చేయడానికి కార్మికులు, కర్షకులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అరుణ్ కుమార్, సీఐటీయూ నగర కార్యదర్శి కె. శ్రీనివాస్, కార్మిక, రైతు, విద్యార్థి,యువజన, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై రేపు నిరసనలు

రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల అమలు, అదానీ ఒప్పందాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 5న రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ శాఖ కార్యాలయాల వద్ద నిరసనలు నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరిట ఇప్పటికే రూ.15,485 కోట్ల భారం ప్రజలపై పడిందని చెప్పారు. ఇళ్లలో బలవంతంగా స్మార్ట్ మీటర్లు అమర్చేందుకు ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. విద్యుత్ పెనుభారాలపై నిర్వహిస్తున్న నిరసనలో ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రైవేటు విద్యా సంస్థల్లోనూ రిజర్వేషన్ కల్పించాలి

ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షులు వరుణ్ చౌదరి



మాట్లాడుతున్న వరుణ్ చౌదరి

నగరంపాలెం: ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యార్థులకు రిజర్వేషన్ కల్పించాలని కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం (ఎన్ఎస్‌యూఐ) జాతీయ అధ్యక్షులు వరుణ్ చౌదరి డిమాండ్ చేశారు. విశ్వ విద్యాలయాలు, కళాశాలల్లో విద్యార్థి ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ 'హమ్ బద్లేంగే' క్యాంపెనింగ్‌ను గురువారం గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్ చౌదరి మాట్లాడుతూ నూతన విద్యా విధానాన్ని, అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలని కోరారు. పేపర్ లీక్‌లను అరికట్టాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని, విద్యార్థులకు తక్షణమే ఉపకారవేతనాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు నాగమధుయాదవ్, జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి రాజీవ్‌గాంధీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇన్‌చార్జి (ఆర్గనైజేషన్/అడ్మినిస్ట్రేషన్) వేముల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కరీం, మాజీ ఎమ్మెల్యేలు లింగంశెట్టి ఈశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా షిర్డీ సాయి మందిర వార్షికోత్సవం



నగరంపాలెం: స్థానిక వికాస్‌నగర్ 11వ వీధిలో గల షిర్డీసాయి మందిరంలో గురువారం 26వ వార్షికోత్సవాన్ని పాలకమండలి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. పండితుల వేదమంత్రాల మధ్య ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అనంతరం లక్ష్మీ గణపతి, నవగ్రహ, వాస్తు దత్త, సుదర్శన హోమాలు నిర్వహించారు.ఉభయ దాతలుగా పూర్ణచంద్రరావు దంపతులు పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన సాయిబాబాకు మధ్యాహ్న హారతిచ్చారు. అనంతరం తీర్థ, అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పూర్ణచంద్రరావు మాట్లాడుతూ గురు పౌర్ణమి సందర్భంగా ఈనెల 9న బాబాకు సామూహిక మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 10న గురుపౌర్ణమి, హారతులు, విశేష దర్శనం ఉంటుందని తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

డీఎస్పీ అరవింద్‌కుమార్



మాట్లాడుతున్న అరవింద్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: సైబర్ ఆధారిత మోసాలపై ప్రజలంతా అప్రమత్తంగా వ్యవహరించాలని గుంటూరు వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ కుమార్ సూచించారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి. నాగభూషణం అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా డీఎస్పీ అరవింద్‌కుమార్ పాల్గొన్నారు. షేర్ మార్కెట్, లోన్ యాప్స్ మోసాలు, వాటి నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆల్కహాల్, పొగాకు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని చెప్పారు. అలవాటు పడితే ఆరోగ్యానికి హానితో పాటు జీవితం అంధకారం అవుతుందని హెచ్చరించారు. వివిధ సైబర్ క్రైమ్స్ గురించి, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అరండల్‌పేటల సీఐ ఆరోగ్యరాజు విద్యార్థులకు తెలియజేశారు. సదస్సులో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ ఎస్. మధుసూదనరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పి. సీతారామయ్య, జె.శివజ్యోతి, సీహెచ్. ప్రసాదరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీతాల పెంపునకు సహకరించాలి



ఎమ్మెల్యే నసీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నేతలు

లక్ష్మీపురం: నగరపాలక సంస్థలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల జీతాల పెంపుదలకు సహకరించాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నగర ప్రధాన కార్యదర్శి కోట మాల్యాద్రి కోరారు. సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం ఇచ్చిన రాష్ట్ర పిలుపులో భాగంగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్‌కు మున్సిపల్ కార్మికుల సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కోట మాల్యాద్రి మాట్లాడుతూ మున్సిపల్ స్థాయి నుంచి గ్రేటర్ కార్పొరేషన్ అయినప్పటికీ గుంటూరులో కార్మికుల సంఖ్య ఏమాత్రం పెంపుదల చేయలేదని తెలిపారు. రిటైర్డ్ అయిన కార్మికుల స్థానంలో వారి పిల్లలకి ఉద్యోగాలు ఇవ్వాలని, నగర ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పారిశుద్ధ్య కార్మికులను పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆప్కోస్ ద్వారా పని చేస్తూ చనిపోయిన వారి పిల్లల 22 మందికి ఉద్యోగాలు ఇవ్వాలని, అందులో పని చేస్తున్న కార్మికులందరికీ ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని కోరారు. ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం తన వంతు సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షులు చిన్నపోతుల వెంకట్రావు, నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, మున్సిపల్ యూనియన్ నాయకులు బట్టు సద్గుణరావు, దాసరి వెంకట్రావు, మిరియాల కోటేశ్వరరావు, పి. దీవెన కుమార్, సీహెచ్. శ్రీనివాసరావు, వెంకట కృష్ణ, దానయ్య, రాజు, రుద్రయ్య, గిరి, ప్రసాద్, శంకర్, ఏసురత్నం పాల్గొన్నారు.

ఢిల్లీలో సమావేశానికి హాజరైన పోస్టల్ సబ్ మాస్టర్



లక్ష్మీపురం: కేంద్ర కమ్యూనికేషన్స్, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి జె.మాధవరావ్ సింధియా బుధవారం ఢిల్లీలో దేశవ్యాప్తంగా 23 సర్కిళ్లకు చెందిన పోస్టల్ సార్టింగ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. దీనికి రాష్ట్రం నుంచి గుంటూరు పోస్టల్ డివిజన్ పరిధిలోని స్తంభాలగరువు, చౌదరిపేట సబ్ పోస్ట్‌మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ షబీనా బేగం హాజరయ్యారు. వ్యూహాత్మక సమన్వయం, ఆవిష్కరణల ద్వారా ఇండియా పోస్ట్‌ను మార్చడానికి ఒక స్పష్టమైన భవిష్యత్ ప్రణాళికను తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ సర్కిల్ తరపున షేక్ షబీనా బేగం హాజరవడం అభినందనీయం అని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొనేందుకు సహకరించిన డివిజన్ పోస్టల్ సూపరిటెండెంట్, యూనియన్ నాయకులకు షబీనా బేగం కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణ



విద్యార్థులతో ప్రిన్సిపాల్స్ కామేశ్వరశాస్త్రి, అనితాదేవి, సుధీర్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి సూచించారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల ప్రాంగణంలో గురువారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కామేశ్వరశాస్త్రి మాట్లాడుతూ ప్రజలంతా బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. మొక్కలు నాటడం వల్ల పచ్చదనంతో పాటు వాతావరణంలో మార్పులు వస్తాయని పేర్కొన్నారు. భావి తరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువత కనీసం రెండు మొక్కలు నాటాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.అనితా దేవి, గుంటూరు జిల్లా జాతీయ సేవా పథకం నోడల్ అధికారి జేవీ సుధీర్ కుమార్, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి యు.రవికుమార్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీలపై రోజురోజుకూ పెరుగుతున్న దాడులు



సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతికుమార్

నెహ్రూనగర్: రాష్ట్రంలో బీసీలపై రోజురోజుకూ దాడులు పెరిగిపోతున్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. చుట్టుగుంటలోని కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయాన అధికారంలోకి రాగానే బీసీలకు రక్షణ చట్టం అమలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇంత వరకు ఆ దిశగా అడుగులు వేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బీసీలు వెన్నెముక అని చెప్పుకునే టీడీపీ పార్టీ వారికి చేసిన న్యాయం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే కూటమి ప్రభుత్వం రక్షణ చట్టాన్ని అమలులోకి తీసుకురావాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, దీక్షలు చేపడతామని ఆయన హెచ్చరించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ఉన్న చట్టాలకు మాదిరిగా బీసీలకు కూడా అమలు చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా అశోక్, రామకృష్ణ, కొల్లూరి హనుమంతరావు, దొంత బ్రహ్మం, యేటి కోటేశ్వరరావు, ప్రసన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.

హస్తకళ, చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం



ప్రదర్శన ప్రారంభిస్తున్న పాలక మండలి అధ్యక్షుడు మస్తానయ్య

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని బాలాజీ కల్యాణ మండపంలో అఖిల భారత హస్తకళ, చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలను ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టా ప్రభాకరరావు ప్రారంభించారు. శ్రీ కళాభారతి చేనేత, హస్తకళా నిర్వహిస్తున్న మేళాలో చేనేత వస్త్రాలు, దేశంలోని పలు రాష్ట్రాల వ్యాపారస్తులు హస్తకళ రూపాలను ప్రదర్శించారు. వెంకటగిరి చీరలు, మహిళల బ్యాగులు, కాటన్ వస్త్రాలు, ఆయుర్వేద ఉత్పత్తులు, గృహోపకరణాలు, చిరు ధాన్యాలు అందుబాటులో ఉన్నాయని సంస్థ నిర్వాహకులు ఆర్. ప్రసాదరావు తెలిపారు. ప్రదర్శన ఈనెల 20వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

విలక్షణ నటుడు ఎస్వీ రంగారావు



ఎస్వీ రంగారావు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నూరిఫాతిమా తదితరులు



రవికుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

పట్నంబజారు: విలక్షణ నటనతో తెలుగు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్న మహా నటుడు ఎస్వీ రంగారావు అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా కొనియాడారు. ఎస్వీ రంగారావు జయంతి పురస్కరించుకుని నెహ్రూనగర్‌లోని ఆయన విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ ఎందరో గొప్ప నటుల మధ్య తనదైన ప్రతిభను చాటుకున్న గొప్ప నటుడు ఎస్వీఆర్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు శృంగారపు శ్రీనివాసరావు, తోట సీతారామరాజు, జూపల్లి హనుమంతరావు, శ్రీనివాస్, షంషేర్, చిలుకా రమేష్, మురికిపూడి రమేష్, కిరణ్ పాల్గొన్నారు.

తెలగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో..

నెహ్రూనగర్ : సహజ నటనతో తెలుగువారి మన్ననలు చూరగొన్న గొప్ప నటుడు ఎస్వీ రంగారావు అని తెలగ అభ్యుదయ సంఘం నాయకులు పేర్కొన్నారు. గురువారం గోరంట్ల హోసన్న మందిరం దగ్గర ఉన్న తెలగ అభ్యుదయ సంఘ కార్యాలయంలో ఎస్వీ రంగారావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు నంది అవార్డులు పొందిన నాటక కళాకారుడు నరాల శెట్టి రవికుమార్ ను సన్మానించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బాలిశెట్టి విజయకుమార్, శేషం సుబ్బారావు, కృష్ణమూర్తి, నరసింహ, శివ, కృష్ణ ప్రసాద్, రోహిత్, నరేంద్ర పాల్గొన్నారు.

విద్యుత్ ఒప్పందాలతో ప్రజలపై పెనుభారం

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్. బాబూరావు

నెహ్రూనగర్ : అదానీ, షిర్డీ సాయి తదితర ప్రైవేట్ కంపెనీలతో అధికార పార్టీలు గత దశాబ్ద కాలంగా చేసుకున్న విద్యుత్ ఒప్పందాలపై పునఃసమీక్ష అవసరమని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్. బాబూరావు డిమాండ్ చేశారు.అవినీతికి పాల్పడిన సంస్థలపై, అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలంతా స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని ఆయన పిలుపునిచ్చారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం గుంటూరులోని కార్యాలయంలో 'విద్యుత్ కుంభకోణాలు – వినియోగదారులపై భారాలు' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బాబూరావు మాట్లాడుతూ అదానీ చేసుకున్న సెకీ ఒప్పందం రాబోయే 25 సంవత్సరాలలో రాష్ట్ర ప్రజలపై రూ.1,20,000కోట్ల భారం పడుతుందని వివరించారు. షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ చేపట్టిన ఒప్పందాల ద్వారా వేలాది కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయ్యిందని తెలిపారు. లోపభూయిష్టమైన విద్యుత్ ఒప్పందాలను ఉప సంహరించుకునేలా పౌర సమాజం పెద్దఎత్తున ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. సౌర విద్యుత్ పేరుతో ఇండోసోల్ కంపెనీ 8,500 ఎకరాల పంట భూములను ప్రత్యేకంగా అత్యున్నతమైన మామిడి పండ్లు కాచే కరేడు, ఉలవపాడు ప్రాంతాల నుంచి సేకరించడం ప్రమాదకరమని హెచ్చరించారు. రైతులు సంఘటితమై భూ సేకరణను తిరస్కరించాలని తెలిపారు. నాడు పంపు సెట్లకు బిగించ తలపెట్టిన స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చిన తెలుగుదేశం నేతలు నేడు ఇళ్లకు బిగించాలని పూనుకోవడం మోసపూరితమని పేర్కొన్నారు. నాడు షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ జగన్‌మోహన్‌రెడ్డి బినామీ సంస్థ అంటూ ప్రచారం చేసి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేసిన తెలుగుదేశం పార్టీ అగ్రనేతలు నేడు ఆ సంస్థతోనే విద్యుత్ ఒప్పందాలు చేసుకోవడం వారి ద్వంద్వ నీతిని బహిరంగ పరుస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సామాజిక విశ్లేషకులు టి.ధనుంజయరెడ్డి, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణ రెడ్డి, విశ్రాంత అడిషనల్ ఎస్పీ చలపతిరావు, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ, చావా శివాజీ తదితరులు ప్రసంగించారు.

బ్యాంక్ రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

చేబ్రోలు: బ్యాంక్ ఖాతాదారులు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ పి.వెంకటేశ్వర్లు సూచించారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ (ఖాతాదారుల చైతన్య, అవగాహన సదస్సు) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కచ్చితమైన లావాదేవీలు నడపాలని, డిఫాల్టర్‌గా ఉండకూడదని తెలిపారు. సిబిల్ స్కోర్ కలిగి బ్యాంకు ద్వారా రుణాన్ని పొంది వ్యాపారాభివృద్ధి పొందాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఎంపీడీవో టి.ఊహారాణి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి సంపాదనలో 20 శాతం పొదుపు చేయడం అనేది భారతీయ రిజర్వ్ బ్యాంకు ముఖ్య ఉద్దేశమని, దీనిని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ మాట్లాడుతూ అంతర్జాతీయ సర్వే ప్రకారం పురుషుల కంటే మహిళలు సంపాదనలో 84 శాతం పొదుపు చేస్తున్నారని తెలిపారు. సూపరింటెండెంట్ ఏ.ఉమాదేవి, వెలుగు ఏపీఎం శ్రీలక్ష్మి, ల్యాంప్ సంస్థ రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.